క్లుప్తంగా

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 11, వంకాయ 23, బెండ 28, పచ్చిమిర్చి35, కాకర 20, బీర 23, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 13, క్యారెట్ 33. దొండ 18, ఆలు 21, ఉల్లి 29, గోకర 23, దోస 18, సొర 09, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 45, అర్వి 35, మునగ 23, చిలగడదుంప 45, బీట్‌రూట్ 21, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 33. గురువారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి



ఎమ్మెల్యేకు ఓటు నమోదు పత్రాలు అందజేస్తున్న ధనలక్ష్మి

మన్సూరాబాద్: బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు డివిజన్ పరిధిలోని గడపగడపకూ తిరిగి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. పలువురి నుంచి నూతన ఓటు నమోదు పత్రాలను సేకరించి బుధవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ధరలక్ష్మి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో ముఖ్యమైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొల్లెపల్లి ధనలక్ష్మి, మంజుల, శ్యామల, సాయికుమారి, స్వాతి, కల్పనా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ఏసీ హెల్మెట్లు అందజేత



ఏసీ హెల్మెట్ ధరించిన కానిస్టేబుల్‌తో ఏసీపీ సత్యనారాయణ

చాదర్‌ఘాట్: ట్రాఫిక్ విధులు నిర్వహించే కానిస్టేబుళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పొల్యూషన్ నుంచి విముక్తి కలిగించేందుకు పోలీస్ శాఖ వారికి బుధవారం అజంపురా చౌరస్తాలో ఏసీ హెల్మెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సౌత్‌ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది దుమ్ము, ధూళి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీ హెల్మెట్స్ అందజేశామని ఆయన తెలిపారు. దీంతో ట్రాఫిక్ విధులు సులభతరంగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మలక్‌పేట ట్రాఫిక్ సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదన్నపేటలో డీసీపీ పర్యటన



పర్యటిస్తున్న డీసీపీ రూపేష్

చంచల్‌గూడ: గణేష్ ఉత్సవాల్లో ప్రశాంతంగా కొనసాగేలా తగు చర్యలు తీసుకోవాలని సౌత్ ఈస్ట్ డీసీపీ రూపేష్ మాదన్నపేట పోలీసులకు సూచించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మాదన్నపేట పీఎస్ పరిధిలో నిమజ్జనం ఊరేగింపు కొనసాగే దారుల్లో ఆయన పర్యటించారు. సున్నితమైన ప్రాంతల్లో బందోబస్తు ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్న, ఇన్‌స్పెక్టర్ కె. సునీల్, ఎస్ఐలు శోభ, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

నిధులు కేటాయించాలని జెడ్సీకి వినతి



జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం ఆమె ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి హస్తినాపురం డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన జెడ్సీ నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు: డీసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాయిశ్రీ

హస్తినాపురం: వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని, పోలీసుల పరంగా తాము భద్రతా ఏర్పాట్లు చేస్తామని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. వనస్థలిపురంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గణేశ్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి డీసీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ సాయిశ్రీ మాట్లాడుతూ, గణేశ్ మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసులకు సమాచారం ఇస్తే తాము వారికి సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు మండపాలకు భద్రత కలిస్తామన్నారు. ఈ పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రతి మండపంలో ఇద్దరూ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలో డీజేలను ఏర్పాటు చేయొద్దన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఏసిపి భీంరెడ్డి, సీఐ జలేంధర్‌రెడ్డి, డీఐ వెంకట్, హయత్‌నగర్ ఎమ్మార్వో బి.సునీత, ఏడీఈ రాంచందర్ పాల్గొన్నారు.

తపోవన్ కాలనీ ఫేజ్–1 ఆర్చి ప్రారంభం



ఆర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

లింగోజిగూడ: లింగోజిగూడ డివిజన్ తపోవన్ కాలనీ ఫేజ్–1 సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఆర్చి ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు పాల్గొని ఆర్చిని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గతంలో చిన్నపాటి వర్షానికి ఈ కాలనీ మొత్తం వరదనీటిలో మునిగిపోయేదని, ఇళ్లు అమ్ముకొని వెళ్లిపోయే పరిస్థితి కూడా ఉండేదన్నారు. అయితే, ఎస్ఎన్‌డీపీ నాలా పనులు సత్ఫలితాలు ఇవ్వడంతో మొన్న కురిసిన వర్షాలకు కాలనీలో నీరు నిలువ లేదని అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలంటే గొర్రెలు, బర్రెలు ఇవ్వడమేనా?

దిల్‌సుఖ్‌నగర్: ఉద్యోగాలు ఇవ్వడం అంటే గొర్రెలు, బర్రెలు ఇవ్వడమేనా.. ఓ వైపు నిరుద్యోగంతో యువత రోడ్డున పడుతుంటే తాగుడు ఊగుడు తెలంగాణగా మార్చే పనిలో సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని మహేశ్వరం బీజేపీ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ పాదయాత్రలో భాగంగా ఆయన ఆర్‌కేపురం డివిజన్ బుధవారం వాస్తుకాలనీ, సిరినగర్ కాలనీలలో కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, ఉద్యోగాలు ఇవ్వలేకపోయిన సీఎం నిరుద్యోగ భృతి అంటూ యువతను మోసం చేశాడని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్ రెడ్డి, పిట్ల ఉపేందర్ రెడ్డి, ప్రదీప్, డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, సిద్ధూ ముదిరాజ్ పాల్గొన్నారు.

సుభాష్‌చందర్జీకి బండి సంజయ్ పరామర్శ



సుభాష్‌చందర్జీ మాతృమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి బండి సంజయ్

సైదాబాద్: మాతృవియోగంతో బాధపడుతున్న గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీని, ఆయన కుటుంబసభ్యులను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పరామర్శించారు. సుభాష్‌చందర్జీ మాతృమూర్తి గంగమ్మ వయోభారంతో పది రోజుల క్రితం మృతి చెందారు. సైదాబాద్‌లోని సుభాష్‌చందర్జీ నివాసంలో బుధవారం ఆమె దశదిన కర్మలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై బండి సంజయ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీల దళపతి ఆర్.కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు



కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పెద్దవూరే బ్రహ్మయ్య

నాగోలు: రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య జన్మదినం సందర్భంగా తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కృష్ణయను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వడ్లాల మడేల్, పున్నాం రాములు, నాగిళ్ల యాదగిరి, శివకృష్ణ, భాస్కర్, రాందేవ్, సాయి, నీలం వెంకటేష్, లాల్ కృష్ణ పాల్గొన్నారు.

ఇందిరాపార్కుకు తరలిన బీజేపీ నేతలు



నిరాహార దీక్ష శిబిరంలో ప్రసంగిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మన్సూరాబాద్: బీజేపీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన 25 గంటల నిరుద్యోగ దీక్షకు ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల నుంచి బుధవారం బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆయా డివిజన్ల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇందిరా పార్కుకు వెళ్లారు.

యువతను మోసం చేస్తున్న కేసీఆర్

సైదాబాద్: యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేస్తున్నాడని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన 24 గంటల నిరాహార దీక్షకు మలక్‌పేట నుండి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు.



నిరుద్యోగ దీక్షలో పాల్గొన్న కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్ రెడ్డి



బీఎన్‌రెడ్డినగర్ నుంచి నిరుద్యోగ దీక్ష శిబిరానికి వెళ్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

మాటల్లోనే అభివృద్ధి: జక్కిడి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధి ఎమ్మెల్యే మాటల్లోనే ఉందని, చేతల్లో మాత్రం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాచైతన్య పాదయాత్రలో భాగంగా బుధవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ నుంచి ప్రారంభమైన యాత్ర 16 కాలనీల మీదుగా హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. నాయకులు బుడ్డ సత్యనారాయణ, భీమిడి రామకృష్ణారెడ్డి, ఎర్ర మహేందర్, క్లెం నర్సింహారెడ్డి, కొలను సుధాకర్‌గౌడ్, యవజన కాంగ్రెస్ నేతలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం 'ఆయుష్మాన్ భవ' లక్ష్యం



బస్తీ దవాఖానాలో ఆయుష్మాన్ భవ ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: ఆయుష్మాన్ భవ పథకం కింద అందజేసే వైద్య సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి కోరారు. బుధవారం న్యూఢిల్లీలో దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయుష్మాన్ భవ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఐఎస్‌సదన్ డివిజన్ సుబ్రహ్మణ్యనగర్ కాలనీలోని బస్తీ దవాఖానాలో కార్పొరేటర్, వైద్యులు, వైద్య సిబ్బంది, బస్తీవాసులతో కలిసి ప్రత్యేక తెరపై వీక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, దేశంలోని ప్రతీ గ్రామం, పట్టణాలలో అందరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలనేదే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు.

వైశ్య గర్జన సభను విజయవంతం చేయండి: కాచం

వనస్థలిపురం: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 1న నిర్వహించే వైశ్య గర్జన సభను విజయవంతం చేయాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. వనస్థలిపురం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం రాత్రి వైశ్యులు– ఆత్మగౌరవం, హక్కుల సాధనపై నిర్వహించిన చర్చా గోష్టికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం 5 అసెంబ్లీ స్థానాలను వైశ్యులకు కేటాయించాలన్నారు. వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, విదేశీ విద్య సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటునందించాలని కోరారు. వైశ్య ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు ఆర్థిక, చట్టపరమైన వెసులుబాట్లు కల్పించాలన్నారు. వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయరాములు, లక్ష్మీనారాయణ, రవికుమార్, మురళీగుప్తా, పరమేశ్వర్, మల్లికార్జున్, భాస్కర్, బాలరాజు పాల్గొన్నారు.



సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ తదితరులు

సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను

జయప్రదం చేయండి

సీఐటీయూ



వనస్థలిపురం లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులతో సమావేశమైన సీఐటీయూ నేతలు

ఎల్‌బీనగర్: మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో గురువారం నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్యలు కోరారు. బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి, ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డులోని నిధులను కార్మికుల సంక్షేమానికి వెచ్చించకుండా పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన చెందారు. బోర్డులోని సభ్యులందరికీ మోటర్ సైకిళ్లను అందజేస్తామని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూకు అనుబంధంగా భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ఆలేటి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఐతరాజు అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదగిరి, ఉపాధ్యక్షులుగా మల్లేష్, చుక్క రాములు, రాంబాబు, రాఘవేంద్ర, సహాయ కార్యదర్శులుగా అంజయ్యగౌడ్, పరుశరాములు, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, భద్రయ్య, బద్దుల ఎల్లయ్యను ఎన్నుకున్నారు.

చైతన్యపురి డివిజన్‌లో రోడ్లను బాగు చేయాలి



జెడ్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

చైతన్యపురి: డివిజన్‌లో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన పలు కాలనీల ప్రతినిధులతో కలిసి జెడ్సీకి వినతి పత్రం అందజేశారు. సాయినగర్ నుంచి శివాజీచౌక్, సత్యనారాయణపురం రోడ్డు, రామాలయం రోడ్డు, గణేష్‌పురి, మారుతీనగర్, ప్రభాత్‌నగర్, వికాస్‌నగర్, న్యూ దిల్‌సుఖ్‌నగర్, ద్వారకాపురి కాలనీ, విద్యుత్‌నగర్, భవానీనగర్ కాలనీల్లోని రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. దీంతో ఈ రోడ్లపై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నూతన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. త్వరలో రోడ్ల వ్యవస్థ మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకుంటామని జెడ్సీ హామీ ఇచ్చారని నర్సింహగుప్తా తెలిపారు.

స్థానికేతరులకు ఇళ్లు కేటాయిస్తే ఉద్యమిస్తాం



నిరహారదీక్ష చేస్తున్న ఎరుకల సంఘం నేతలు

మన్సూరాబాద్: స్థానికులను విస్మరించి ఇతరులకు డబుల్ ఇళ్లు కేటాయిస్తే తీవ్రంగా ఉద్యమిస్తామని ఎరుకల సంఘం అధ్యక్షుడు జగన్నాథం గంగయ్య హెచ్చరించారు. ఎరుకల నాంచారమ్మ డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయల వద్ద ఎరుకల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహారదీక్ష బుధవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్న వారికి డబుల్ ఇళ్లు కేటాయించారని, కాని కొంతమంది మిగిలిపోయారని వారికి కూడా డబుల్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్‌రెడ్డి ఎరుకల కులస్తులకు ఏమి చేశారని ప్రశ్నించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారయ్య, స్వామి, అంజి, అనిత, హేమలత, పాపమ్మ, సమ్మక్క, విజయ్, రాంబాబు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భవ'ను సద్వినియోగం చేసుకోవాలి



పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

మలక్‌పేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ డివిజన్ కార్పరేటర్ బొక్క భాగ్యలక్ష్మీమధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన పథకం ఇప్పుడు ఏబీహెచ్ఏ హెల్త్‌కార్డుగా మార్చారన్నారు. వెబ్‌సైట్ ఓపెన్ అయిందని ఇందులో రిజిస్టర్ అయిన వారికి ఉచితంగా 5 లక్షల రూపాయల ఆయుష్మాన్ ఏబీహెచ్ఏ హెల్త్‌కార్డు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణ్, డాక్టర్ ప్రణిత, ఆశవర్కర్లు మానస, అపర్ణ, మంజుల, మహేశ్వరి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు



జేసీబీలతో పనులు చేస్తున్న దృశ్యం



పద్మావతి కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగు

- తవ్వకాలకు అడ్డొస్తున్న బండరాళ్లు
- పద్మావతి కాలనీని ముంచెత్తున్న మురుగు నీరు

హయత్‌నగర్: కృంగిపోయిన హయత్‌నగర్ పాత రోడ్డులో మరమ్మతు పనులు బుధవారం కూడా కొనసాగాయి. సుమారు 20 అడుగుల లోతులో ఉన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేసేందుకు జేసీబీలను రంగంలోకి దింపారు. ఓ పక్క రోడ్డును తవ్వుతుంటే మరోపక్కన మట్టి పడి పోతుంది. అదే సమయంలో మ్యాన్‌హోల్ పక్కన నుంచి సీవరేజీ వాటర్ బయటికి వస్తోంది. మోటార్‌ను బిగించి ఈ నీటిని బయటికి తోడుతున్నారు. ఈ నేపథ్యంలో పనులకు అంతరాయం ఏర్పడుతోంది. మ్యాన్‌హోల్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ట్రంక్‌లైన్ వెనుక వైపు ఉన్న మ్యాన్‌హోళ్ల నుంచి నీరు బయటికి వచ్చి పైప్‌లైన్ వెంట ఉన్న పద్మావతి కాలనీలోని రోడ్లపై పారుతోంది. దీంతో కాలనీ రోడ్లన్నీ మురుగు నీరు పారుతుండటంతో కాలనీవాసులు మురుగు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీ నుంచి మురుగు నీరంతా పక్కనే ఉన్న కుమ్మరికుంట చెరువులోకి చేరుతుండటంతో అది మురుగుతో నిండిపోయింది. రోడ్డు మరమ్మతు పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో, ఎన్ని రోజులు ఈ ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైప్‌లైన్ నిర్మాణంలోనే నిర్లక్ష్యం...

వనస్థలిపురం నుంచి కుంట్లూర్ చెరువు వరకు 18 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పైప్‌లైన్ నిర్మాణ సమయంలోనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. భూమి తవ్విన చోట బయటికి తీసిన పెద్ద పెద్ద బండరాళ్లను పైపులు వేసిన తర్వాత అక్కడే పూడ్చి వేశారు. దీంతో మరమ్మతులు చేసేందుకు ఆ రాళ్లు అడ్డు వస్తున్నాయి. పైప్‌లైన్ నిర్మించిన తర్వాత రోడ్డు వేసిన ఆర్ అండ్ బీ అధికారులు మ్యాన్‌హోళ్లను పైకి లేపకుండా అవి మూసుకుపోయే విధంగా వాటిపై నుంచి రోడ్డు వేశారు. ఈ విధంగా మూడు అడుగుల లోతు వరకు మ్యాన్‌హోళ్లు రోడ్డు కిందికి వెళ్లిపోయాయి. మున్సిపాలిటీ అధికారులు, ఆర్ అండ్ బీ, సీవరేజీ బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్య జటిలంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నాలుగు రోజుల్లో పూర్తి చేస్తాం....

మ్యాన్‌హోల్ టూ మ్యాన్‌హోల్ 40 మీటర్ల వరకు రోడ్డు కృంగి పోయింది. ఇక్కడ పైపులను మారుస్తాం. పైపుల కోసం కంపెనీకి ఆర్డర్ ఇచ్చాం. మ్యాన్‌హోళ్లను గుర్తించేందుకు ప్రత్యేక పరికరాన్ని తెప్పించి మ్యాన్‌హోల్ ఉన్న దగ్గర మార్కింగ్ చేస్తున్నాం. రోడ్డును తవ్వి గుర్తించిన మ్యాన్‌హోళ్లను పైకి నిర్మిస్తాం. నాలుగు రోజుల్లో ప్రధాన మరమ్మతు పనులు పూర్తి చేసి పైప్‌లైన్ వెంట ఎక్కడ ఎక్కడ లీకేజీలు ఉన్నాయో గుర్తించి పైప్‌లైన్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్